చెక్‌పోస్ట్‌ను ఏఎస్పీ తనిఖీ

విశాలాంధ్ర - పరవాడ: అనకాపల్లి జిల్లా పరవాడ మండలం దేశపాత్రుని పాలెంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్‌ను జిల్లా అదనపు ఎస్పీ టి.విజయభాస్కర్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న జిల్లా పోలీస్ సిబ్బంది, కేంద్ర పోలీస్ దళాలు సంయుక్తంగా వాహన తనిఖీలు నిర్వహించి, అక్రమ రవాణా అరికట్టేందుకు డబ్బు, మద్యం, నాటు సారా, గంజాయి, ఉచిత కానుకలు పంపిణీ నిరోధించేందుకు పటిష్ట తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అదనపు ఎస్పీ వెంట పరవాడ ఇన్ స్పెక్టర్ బాల సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



ఆవఖండంలో అక్రమ లేఅవుట్‌పై చర్యలకు రెవెన్యూ సిద్ధం..?

ఇప్పటికే మూడుసార్లు సర్వే..?

అనుమతులు ఉన్నాయని అడ్డంగా బుకాయిస్తున్న రియాల్టర్లు

చూపించమంటే తెల్లముఖం వేస్తున్న వైనం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ***అడ్డు అదుపు లేకుండా.. ఎవరో ఒకరి అండతో ఆవఖండం లాంటి నీరు నిల్వ ఉండి, పంటల సాగుకు అనువుగా ఉండే ప్రాంతాలలో ఎటువంటి నిర్మాణాలకు అనుమతి లేదని, ఇవ్వకూడదని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, ప్రభుత్వాలు ఆదేశాలు, జీవోలు జారీ చేసినా వాటిని బేఖాతరు చేస్తూ రియల్ దందాకు తెగబడుతున్న విషయం తెలిసిందే..***

జిల్లా కేంద్రంలో సౌత్ 2 రెవెన్యూ పరిధిలో ఆవఖండం భూముల్లో రియాల్టర్లు రియల్ దందా సాగిస్తున్న వైనంపై విశాలాంధ్ర దినపత్రికలో ఫిబ్రవరి 27న ఆవఖండంలో మళ్లీ విధ్వంసం, మార్చి 7న ఆవఖండంలో లేవుట్‌తో అనకాపల్లికి భారీ విపత్తు లాంటి కథనాలు వచ్చిన విషయం పాఠకులకు తెలిసిందే.. ఈ కథనాలపై స్పందించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మార్చి 20న ఆవఖండం లే అవుట్‌ను పరిశీలించి ఆందోళన వ్యక్తం చేశారు. ఆవఖండంలో భూములను రక్షించాలంటూ డిమాండ్ చేశారు. విశాలాంధ్ర దినపత్రికలో వచ్చిన కథనాలకు, భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) చేసిన డిమాండ్ నేపథ్యంలో రెవెన్యూ వర్గాల్లో కదలిక వచ్చినట్లు తెలిసింది. మూడు రోజులపాటు రెవెన్యూ వర్గాలు ఆవఖండంలో గల అక్రమ లేఔట్‌లో సర్వే చేసి వాస్తవాలను గుర్తించి నివేదిక తయారుచేసినట్లు తెలిసింది.

మూడు రోజులపాటు ఆవఖండం భూముల్లో గల అక్రమ లేఅవుట్‌లో సర్వే చేసిన రెవెన్యూ అధికారులకు రియల్ దందా అడుగడుగునా అడ్డంకులు సృష్టించినట్లు విశ్వసనీయ సమాచారం. అయినప్పటికీ వారి బెదిరింపులను సైతం లెక్కచేయకుండా రెవెన్యూ అధికారులు వాస్తవ నివేదికను తయారు చేసినట్లు తెలిసింది. 24 ఎకరాలలో భూమికి నాలుగు అడుగుల మేర అక్రమంగా తరలించిన గ్రావెల్‌తో ఎత్తు చేశారని దాని విలువ సుమారు 15 కోట్లు ఉంటుందని అంచనా వేసినట్లు సమాచారం. డెవలప్మెంట్ పేరుతో రియాల్టర్లకు భూములు ఇచ్చిన రైతులకు సైతం నోటీసులు ఇవ్వడానికి రెవెన్యూ సిద్ధమైనట్లు సమాచారం. అంతేకాకుండా ఎటువంటి అనుమతులు తీసుకోవడానికి, ఇవ్వడానికి అవకాశం లేని ప్రాంతంలో అనుమతులు ఉన్నాయని రియాల్టర్ చెప్పడం, ఉంటే ఆ డాక్యుమెంట్లు తీసుకురావాలని రెవెన్యూ అధికారులు బదులు ఇవ్వడం, రియాల్టర్లు తీసుకురాకపోవడం విశేషం. అంతేకాకుండా ఆవఖండం భూముల్లో దర్జాగా సిమెంట్ రోడ్డు నిర్మించిన విషయంపై కూడా రెవెన్యూ అధికారులు సీరియస్‌గా ఉన్నారని, ఆ రోడ్ల నిర్మాణంపై కూడా భారీ జరిమానా విధించే విధంగా నివేదిక సిద్ధం చేసి మరికొద్ది రోజుల్లోనే యాక్షన్ తీసుకోవడానికి సన్నద్ధమవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న పాల్తేటి

విశాలాంధ్ర - కె.కోటపాడు: మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. మండలం రామయోగి అగ్రహారం గ్రామానికి చెందిన పాల్తేటి పెంటారావు విద్యార్థి దశ నుండే దళిత ఉద్యమాలు నిర్వహించి దళిత సంఘాల్లో ధైర్యాన్ని నింపారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పదవీ విరమణ పొంది పూర్తిగా కుల సంఘాల బలోపేతానికి తన వంతు కృషి చేస్తున్నారు. మాల మహానాడు అధ్యక్షుడిగా రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన పాల్తేటి పెంటారావు టీడీపీలో చేరడం మరింత బలం చేకూరినట్లు అయిందని మాడుగుల టీడీపీ అభ్యర్థి పైల ప్రసాద్ రావు అన్నారు. మహిళా విభాగం అధ్యక్షురాలు నక్కలి నాగమణి కూడా టీడీపీ పుచ్చుకున్నారు.

చిక్కాల రామారావుకు ఘన సన్మానం

విశాలాంధ్ర - పాయకరావుపేట: నర్సీపట్నం ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైసీపీ మండల అధ్యక్షులు చిక్కాల రామారావును ఆ పార్టీ నాయకులు శాలువా, పూలదండతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొంతం నరేష్, పల్లెల దొర, గూటూరు వెంకటేశ్వరరావు, పాలపర్తి సతీష్, పల్లెల వెంకట్, చేపల తాతాజీ, చేపల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు

విశాలాంధ్ర - యస్.రాయవరం: ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నక్కపల్లి సిఐ జి.అప్పన్న తెలిపారు. ఆదివారం మండలంలోని బంగారమ్మ పాలెం, రేవు పోలవరం, కొరుప్రోలు తదితర గ్రామాల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఏ. విభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

కోడి వ్యర్థాలను తరలిస్తున్న ఆటో అప్పగింత

విశాలాంధ్ర - దేవరాపల్లి: దేవరాపల్లి మండలంలోని అనేక గ్రామాల్లో అనుమతులు లేకుండా చేపల పెంపకం కొనసాగిస్తున్నారు. ఈ చేపల చెరువులపై గ్రైండింగ్ మిషన్లు తొలగించాలని, కోడి మాంసపు వ్యర్థాలను వెయ్యకూడదని రెవెన్యూ అధికారులు నోటీసులు జారీచేశారు. కానీ మండల కేంద్రం ఈ చేపల చెరువుల యజమానులు కోడి వ్యర్థాలను చేపలకు మేతగా వెయ్యడం ఆపలేదని సీపీఎం కార్యదర్శి కార్యవర్గ సభ్యులు డి.వెంకన్న అన్నారు. వెంకన్న ఆదివారం మండల కేంద్రంలో చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న ఆటోను పట్టుకొని దేవరాపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించడం జరిగిందని తెలిపారు.

ఘనంగా మట్టల ఆదివారం

విశాలాంధ్ర - మాకవరపాలెం: మట్టల ఆదివారం కార్యక్రమాన్ని క్రీస్తు సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి తామరం వరకు మాకవరపాలెం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. క్రీస్తు ప్రార్థనా గీతాలు ఆలపిస్తూ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో అధిక సంఖ్యలో పిల్లలు, పెద్దలు, పాస్టర్లు పాల్గొన్నారు.

వైసీపీ నేత భూదాహానికి చేనేత కుటుంబం బలి

సీఎం జగన్ తన పదవికి రాజీనామా చేయాలి
టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి

విశాలాంధ్ర - మునగపాక: వైసీపీ నేత భూదాహానికి చేనేత కుటుంబం బలి అయిందని, అందుకు సహకరించిన రెవెన్యూ అధికారులపై వెంటనే తగు చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఆకృత్యాలను అదుపు చేయలేని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాజంపేట పార్లమెంట్, ఒంటిమిట్ట మండలం, కొత్త మాధవరానికి చెందిన పాల సుబ్బారావు, పాల పద్మావతి, వీరి కుమార్తె వినయ చేనేతకు చెందిన చేతి మగ్గం ఆధారంగా కుటుంబాన్ని పోషించేవారని, వీరికి ఒంటిమిట్ట పరిధిలోని హైవే పక్కన 3.10 ఎకరాల భూమిపై వైసీపీ పెద్దలు కన్ను పడి రెవెన్యూ వారితో కుమ్మక్కై అక్రమంగా ఆన్లైన్ చేసుకున్నారని తెలుసుకుని తమ భూమి ఎట్లా అన్యాక్రాంతం చేస్తారని పలుమార్లు రెవెన్యూ వారిని సంప్రదించినా పేదవాడైన పాల సుబ్బారావు మాటను పట్టించుకోనందున వారి కుటుంబం బలి కావలసి వచ్చిందన్నారు.

ఈ సంఘటనకు కారణమైన వారిని వెంటనే కఠినంగా శిక్షించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెంటకోట విజయ్, దొడ్డిరమేష్, మల్ల నరసింగరావు, కాండ్రేగుల శంకర్ పాల్గొన్నారు.

పైలా సమక్షంలో టీడీపీలో చేరికలు

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం పోతనపూడి అగ్రహారం గ్రామ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి పైలా ప్రసాదరావు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పైలా ప్రసాదరావు సమక్షంలో వైసీపీకి చెందిన కోన శ్రీను, ముచ్చల రమణబాబు, కోరుకొండ వెంకునాయుడు, కోరుకొండ శివాజీ, ముచ్చల ఎరకునాయుడు, అప్పికొండ సురేష్, బంటు వరాహాల నాయుడు, అప్పికొండ అప్పారావు, కోన శ్రీను, కోన రాజుబాబు, పచ్చి పాల నగేష్ తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాదరావు వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు, సర్పంచ్ కోరుకొండ సాంబమూర్తి, మాజీ సర్పంచ్‌లు కోరుకొండ సూరిఅప్పారావు, పెంటకోట రాము, మాజీ కోఆపరేటివ్ వైస్ ప్రెసిడెంట్ మడగల వెంకటరమణ, జనసేన గ్రామ నాయకులు పడాల శ్రీను, బంటు నాగరాజు, బీజేపీ నాయకులు ధర్మిశెట్టి నారాయణరావు పాల్గొన్నారు.

ఘనంగా అనిత పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - యస్.రాయవరం: టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పాయకరావుపేట నియోజకవర్గం టీడీపీ, జనసేన, బిజెపి పార్టీల ఉమ్మడి అభ్యర్థిని వంగలపూడి అనిత పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం గోకులపాడు గ్రామంలో మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అనిత చేతుల మీదుగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వాకపాడు ఎంపిటిసి మాథవ్, మండల టిడిపి అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, జనసేన మండల అధ్యక్షుడి పప్పల శివ, జనసేన సీనియర్ నాయకులు ఉమ్మిడి సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, టిడిపి జనసేన, బిజెపి పార్టీల ఉమ్మడి అభ్యర్థి వంగలపూడి అనిత జన్మదిన వేడుకలు పాయకరావుపేట పట్టణంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, పెదిరెడ్డి నాగ వెంకటరమణ, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకు ముందు పార్టీ నాయకులు గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు.

సుందరపు సమక్షంలో జనసేనలో చేరికలు

విశాలంధ్ర - అచ్యుతాపురం: జనసేన పార్టీ కార్యాలయంలో మండలంలో చీమలపల్లి గ్రామానికి చెందిన సుమారు 20 మంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, కట్టుపాలెం గ్రామానికి చెందిన సుమారు 15 మంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సుందరపు సమక్షంలో ఆదివారం జనసేన పార్టీలో చేరారు. వీరందరికీ ఎలమంచిలి నియోజకవర్గ ఉమ్మడి జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్య క్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు జనపరెడ్డి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు బైలాపూడి శ్రీరామదాసు, సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి బాబ్జి, ఉపాధ్యక్షులు సియాద్రి రవి, పైల రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.రెండు లక్షలు స్వాధీనం

విశాలాంధ్ర - నక్కపల్లి: నక్కపల్లి మండలంలోని వేంపాడు టోల్ ప్లాజా వద్ద సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం ఒక కారులో రూ.2 లక్షలు తరలిస్తుండగా పట్టుకున్నామని సీఐ విజయ్ కుమార్ తెలిపారు. గాజువాక కణితి రోడ్‌కు చెందిన గంగుమల్ల ప్రమోద్ కారులో పాయకరావుపేట నుంచి యలమంచిలి వైపు ఎటువంటి డాక్యుమెంట్లు లేకుండా రూ.2 లక్షలు నగదు తరలిస్తుండగా, తనిఖీ చేసి పట్టుకున్నామని చెప్పారు.

క్షయ వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం

జిల్లా క్షయ నివారణాధికారి డా. బాలాజీ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తతతో ఉండాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎం.వి.ఎస్ బాలాజీ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా ఆయన అధ్యక్షతన డీఎల్‌ఓ ఆఫీసులో అవగాహన సదస్సు జరిగింది. డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ చికిత్సతో క్షయ వ్యాధి పూర్తిగా నివారించవచ్చని చెప్పారు. వారం రోజులు పైబడి దగ్గుతో బాధపడుతున్న వారు కెల్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. డాక్టర్ సలహా మేరకు మందులు వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులతో కలిసి ఎన్టీఆర్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. డిఎల్‌ఓ ఆఫీస్‌లో వైద్య సిబ్బందికి, టీబి చాంపియన్స్‌కి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు ఎన్నికల ప్రచారం ప్రారంభం

విశాలాంధ్ర - పాయకరావుపేట: వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు ఎన్నికల ప్రచారాన్ని మండలంలోని శ్రీరాంపురం గ్రామం నుంచి ఆదివారం ప్రారంభించారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రజలను ఓటు వేసి గెలిపించాలని కంబాల జోగులు కోరారు. ఎన్నికల ప్రచారం ప్రారంభించిన శ్రీరాంపురం గ్రామానికి మండలంలోని పలు గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, జిల్లా వ్యవసాయ సలహా మండల చైర్మన్, వైసీపీ మండల అధ్యక్షులు చిక్కాల రామారావు, ధనిశెట్టి బాబూరావు, జిల్లా ప్రచార కమిటీ విభాగం అధ్యక్షులు దగ్గుపల్లి సాయి బాబా, జగతా శ్రీను, పార్టీ పట్టణ అధ్యక్షులు ధనిశెట్టి సత్య మహేష్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విన్నర్‌గా జాలంపల్లి టీమ్

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం సాగరం గ్రామంలో మోదకొండమ్మ సందర్భంగా మాడుగుల నియోజవర్గం బుచ్చియ్యపేట, రావికమతంతో పాటు ఆరు మండలాలకు సంబంధించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ సాగరం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నెల 9వ తేదీ నుండి 24వ తేదీ వరకు ఈ క్రికెట్ టోర్నమెంట్ జరిగాయి. ఈ టోర్నమెంట్లో సుమారుగా 36 టీంలు పాల్గొన్నాయి. ఆదివారం జరిగే ఫైనల్ లో సాగరం జాలంపల్లి తలపడ్డాయి. దీంతో ఫైనల్లో విజేతగా జాలంపల్లి టీం నిలిచింది. విజేతగా మొదటి బహుమతిగా జాలంపల్లికి 20 వేల రూపాయలు క్యాష్ అవార్డు ఇచ్చారు. రెండో బహుమతిగాను 15000 సాగరం, మూడో బహుమతిగా రావికమతం 10000 అందుకున్నారు. ఈ బహుమతులు సాగర యూత్ ఆధ్వర్యంలో టోర్నమెంటు జరిగిందని యూత్ సభ్యులు తెలిపారు. జాలంపల్లి టీంకు జాలం పల్లి గ్రామ పెద్దలు, మండల యాదవ సంఘం అధ్యక్షులు , మాజీ సర్పంచ్ పల్లా శ్రీనివాసరావు, నమ్మి బాలరాజు, పలువురు గ్రామ పెద్దలు అభినందించారు.

జాతీయ స్థాయి యోగ పోటీలకు చోడవరం విద్యార్థి

విశాలాంధ్ర - చోడవరం: జాతీయ స్థాయి యోగా పోటీలకు చోడవరం పతంజలి యోగ శిక్షణ కేంద్రం విద్యార్థి కొట్టాపు హరి కిరణ్ ఎంపికైనట్లు శిక్షణా కేంద్రం గురువు పుల్లేటి సతీశ్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఈ నెల 29, 30, 31 తేదీల్లో తమిళనాడు రాష్ట్రం, దిండిగల్‌లో నేషనల్ యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగబోయే నాలుగవ జాతీయ స్థాయి యోగా పోటీల్లో పతంజలి యోగా శిక్షణ కేంద్రం విద్యార్థి కొట్టాపు హరి కిరణ్ పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే యోగా విద్యార్థికి పతంజలి యోగా శిక్షణ కేంద్రం అధ్యక్షులు పసుమర్తి శేష అశోక్, తవ్వ మురళి. ఎస్.ఎస్.ఎస్. షాపింగ్ మాల్ పసుమర్తి గుప్తా, రెడ్డి అప్పారావు, యోగా టీచర్ బొగవిల్లి గణేష్ 3000 రూపాయలు ఆర్థిక సాయం అందించారని యోగ గురువు పుల్లేటి సతీష్ తెలిపారు. ఈ యోగ క్రీడాకారున్ని డాక్టర్ బంగారు కృష్ణ ఉదషోయ విద్యాసంస్థల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ, సీనియర్ జర్నలిస్ట్ ఓరుగంటి రాంబాబు, రవితేజ, యోగ శిక్షణ కేంద్ర సభ్యులు చోడవరం ప్రముఖులు, పలువురు అభినందించారు.

పైలాకు కూటమి సంఘీభావం

విశాలాంధ్ర - చీడికాడ: మాడుగుల నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావును మండలంలోని అర్జునగిరి గ్రామానికి చెందిన కూటమి కార్యకర్తలు, నాయకులు కలుసుకొని ఆయనకు శుభాకాంక్షలు తెలియచేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. టీడీపీకి కంచుకోటగా ఉన్న మాడుగుల నియోజకవర్గానికి పూర్వవైభవం తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. తాము అందరిని కలుపుకొని సమన్వయంతో ముందుకు వెళ్తామన్నారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఓటమి తధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జాజీమొగ్గల ప్రసాద్, పెంటకోట అమ్మతల్లినాయుడు, రెడ్డి సన్యాసినాయుడు, జనసేన మండల కార్యదర్శి పెంటకోట సూరిబాబు, కామిరెడ్డి ఎరుకునాయుడు తదితరులు పాల్గొన్నారు .

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విశాలాంధ్ర-కే కోటపాడు : మండలంలోని చౌడువాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రోలుగుంట మండలం శరభవరం గ్రామానికి చెందిన యువకుడు బొబ్బిలి ప్రసాద్(24) మృతి చెందాడు. కే. కోటపాడులో ఇంటర్ సార్వత్రిక పరీక్షలు రాసేందుకు శనివారం శరభవరం నుంచి బైక్ పై కోటపాడు వస్తూ చౌడువాడ సమీపంలో ఆర్టీసీ బస్సును తప్పించే క్రమంలో రోడ్డు పక్కన ద్విచక్ర వాహనాలను ఢీకొన్నాడు. ఈ ఘటనలో ప్రసాద్ తలకు తీవ్ర గాయం కాగా కుడికాలు విరిగింది. స్థానికులు 108 వాహనంలో కే కోటపాడు ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్ కు పంపారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడని ఎస్ఐ లక్ష్మీనారాయణ చెప్పారు. ప్రసాద్ అచ్యుతాపురంలోని ఇషాన్ చిన్న పిల్లల ఆసుపత్రిలో పనిచేస్తున్నాడని తల్లిదండ్రులు పేర్కొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలోకి భారీగా చేరికలు

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. మేజర్ పంచాయతీ అయినా తుమ్మ పాల గ్రామంలో 200 మంది యువకులు వైసీపీ కి రాజీనామా చేసి జనసేన తీర్థం పుచ్చుకున్నారు.. యువ నాయకుడు బొడ్డపాటి రామ్‌కుమార్ ఆధ్వర్యంలో వీరంతా మాజీ మంత్రి అనకాపల్లి జనసేన టిడిపి బిజెపి ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ సమక్షంలో చేరారు వీరికి రామకృష్ణ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.. పార్టీకి పనిచేయాలని పవన్ కళ్యాణ్.. చంద్ర బాబు నాయకత్వంలో జనసేన పార్టీ అనకాపల్లిలో గెలవడం ఖాయం అని అన్నారు.. నియోజకవర్గంలో యువత జనసేన వైపు అండగా నిలవడం హర్షణీయమన్నారు ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజల నుండి వస్తున్న స్పందన రాబోయే మార్పులకు సంకేతం అన్నారు అలాగే మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ .కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు.. అనంతరం ఆ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు అనూహ్య స్పందన లభించింది ..రామ్ కుమార్ కు తుమ్మపాలలో మంచి ఫాలోయింగ్ ఉన్న నాయకుడిగా గుర్తింపు ఉంది.. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కర్రి బాబి పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. 80 వార్డు డివిజన్ (ఓల్డ్ 24 వ వార్డ్) అంబేద్కర్ నగర్లో కొణతాల రామకృష్ణ విజయాన్ని కాంక్షిస్తూ విస్తృత ఎన్నికల ప్రచారం జరిగింది .టిడిపి డివిజన్ ఇంచార్జ్ బిఎస్ఎం కే జోగి నాయుడు బిజెపి డివిజన్ ఇంచార్జ్ మారిశెట్టి భాస్కర్ రావు జనసేన పార్టీ నాయకులు మల్ల శ్రీనివాసరావు 24 వ వార్డు అధ్యక్షులు కర్రి మల్లేశ్వరరావు ఆధ్వర్యంలోఈ ప్రచారం ప్రారంభించడం జరిగింది. అంబేద్కర్ నగర్లో రామకృష్ణ కి అఖండమైన విజయం సాధించడానికి మా వంతు సహకారం అందిస్తామని మహిళలు యువకులు పేర్కొన్నారు .అత్యధికంగా రామకృష్ణ అంటే మంచి వ్యక్తని గెలిపించుకోవలసిన ఆవశ్యకతను ఇంటింటికీ చెప్పడం జరిగింది.. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే సూపర్ సిక్స్ పథకాలు ఏ రకంగా అమలు చేస్తారో మహిళలకు వివరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బొడ్డేటి మురళి, గోవాడ రాజు, మర్ర జాగనూకేశ్వరరావు , శ్రీనివాసరావు, బుద్ధ మహాలక్ష్మి నాయుడు, బొడ్డేటి నూకరాజు, విశ్వనాథం జనసేన పార్టీ నాయకులు విల్లూరి హరి, కోరుబిల్లి పరి ,కొణతాల రామకృష్ణ అభిమానులు పిల్ల కొండయ్య నాయుడు ,బుద్ధ లక్ష్మణరావు సూరిశెట్టి రాముడు, పీల రాముడు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు కొణతాల రామకృష్ణ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణ ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షులు కాండ్రేగుల జోగేంద్ర , గోవింద మిత్రమండలి ఆధ్వర్యంలో గవరపాలెం పార్క్ సెంటర్లో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సుమారు 200 మంది యువకులు జనసేన పార్టీలో జాయిన్ అవ్వడానికి నిర్ణయించుకున్నారు. త్వరలో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ సమక్షంలో జనసేన పార్టీలోలో జాయిన్ చేద్దామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దాడి త్రినాథ్, కాండ్రేగుల సునీల్, వెల్లూరి బాలు, కాండ్రేగుల రాజేష్, కాండ్రేగుల శ్రీనివాస్, పెంటకోట అరవింద్, సత్యదేవ్, లోవ కుమార్, ఉమా మహేష్, శంకర్, బి .ఎం. నాయుడు, మల్ల జగన్నాధ రావు, దీపక్, సంతోష్, శివయ్య, శిరీష్, కొప్పాక యూత్, కోటినివేది యూత్, అగ్రహారం యూత్ రంగేళి బ్యాచ్ పాల్గొన్నారు.

సుందరపు సమక్షంలో అల్లవరపు జనసేనలో చేరిక

విశాలాంధ్ర-మునగపాక: మండల జనసేన పార్టీ కార్యాలయంలో వై.సి.పి పార్టీ మండల ఉపాధ్యక్షులు పదవికి అల్లవరపు రమణబాబు యలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో పార్టీలో చేరారు.ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జనసేన టిడిపి బిజెపి ఉమ్మడి అభ్యర్థి గా యలమంచిలి నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్నాని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.వైసిపి ప్రభుత్వంలో అక్రమాలు, భూకబ్జాలకు నిలయంగా మారిందని అన్నారు. యలమంచిలి నియోజకవర్గంలో కన్నబాబు అభివృద్ధి చేసింది ఏమీ లేదని ధ్వజమెత్తారు.మునగపాక గ్రామానికి చెందిన వ్యాపారవేత్త ఆడారి కృష్ణ ,కోయిలాడ రాంబాబు మాజీ కోపరేటివ్ వైస్ ప్రెసిడెంట్ (వాడ్రాపల్లి) , కోలంకి మోహన్ రావు (ఆనందపురం) మాజీ పాల ప్రెసిడెంట్, పి.ఎ.సిఎస్ వార్డ్ నెంబర్ కర్రీ రాజారావు (ఆనందపురం) వంద వందమంది అనుచరులతో ఎలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.వి సత్యనారాయణ ఆధ్వర్యంలో మునగపాక మండల పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు టెక్కలి పరశు రాం,పైలా రామానాయుడు, బైలంపూడీ రామదాసు, ప్రధాన కార్యదర్శి కాళ్ళ చంద్రమోహన్, మొల్లేటి ఆనంద్, ఆడారి శ్రీకాంత్, ఒంపోలు సర్పంచ్ సూరిబాబు, యస్ అప్పలనాయుడు, వీరమహిళ సరోజినీ అదిక సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు.

పెదముషిడివాడలో ఆగని అక్రమ గ్రావెల్ తవ్వకాలు

–చోద్యంచూస్తున్న అధికార యంత్రాంగం

గ్రావెల్ తవ్వకాలు జరిపిన దృశ్యాలు

విశాలాంధ్ర -పరవాడ; పరవాడ మండలం పెదముషిడివాడలో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతుంది. పగటి వేళ అడపా దడపా గ్రావెల్ తరలిస్తున్న గ్రావెల్ దొంగలు చీకటిపడితే చాలు గట్టుని, గుట్టనూ వదలడం లేదు. కొండలను సైతం పిండి చేస్తూ యదేచ్ఛగా అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. జేసీబీలతో తవ్వి లారీలతో తరలిస్తున్నారు. లంకెలపాలెం కేంద్రంగా గ్రావెల్ రవాణా జరుగుతున్నా అధికార యంత్రాంగం అసలు పట్టించుకోనేలేదు. ఇక్కడ రెవెన్యూ సిబ్బంది కూడా గ్రావెల్ మాఫియాతో కుమ్మక్కయినట్లు ఎప్పటి నుంచో ఆరోపణలు ఫిర్యాదులు కూడా ఉన్నాయి. అయినప్పటికీ ఉన్నతాధికారులు కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు ఎక్కడా కనిపించలేదు. దీంతో గ్రావెల్ దొంగలు ఎక్కడి బడితే అక్కడ జేసీబీలతో తవ్వేసి లారీలతో తరలించుకుపోతున్నారు. మూడున్నరేళ్ల కాలంలో కోట్లాది రూపాయల గ్రావెల్ వ్యాపారం జరిగిందంటే ఆయా శాఖాధికారులు సహాయ సహకారాలు ఎంతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇది వరకూ సర్వేనెంబర్ 365, 407, 408, 409లతో పాటు 367 ల్యాండ్ పూలింగ్ ప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలు విచ్చలవిడిగా జరిగాయి. అయితే వీరికి అనుకూలంగా ఉండే ఇక్కడ వీఆర్వో సస్పెండ్ కావడంతో గ్రావెల్ దొంగలు కొన్ని రోజులు సైలెంట్‌గా ఉన్నారు. ఆ గ్రామంలో ఇంకా ఎవరినీ నియమించకపోవడంతో మళ్లీ నాలుగైదు రోజులుగా గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. అంతా ఒక్కటై ల్యాండ్ పూలింగ్ ప్రాంతం సర్వేనెంబర్ 367లో తవ్వేస్తున్నారు. రాత్రి 10 గంటలు మొదలుకొని తెల్లవారు 5గంటల వరకూ ఈ అక్రమ గ్రావెల్ దందా సాగుతోంది. ఈ గ్రావెల్ లారీలు పెదముషిడివాడ నుంచి అటు ఈ మర్రిపాలెం, ఇటు మంత్రిపాలెం మీదుగా లంకెలపాలెం చేరుకుంటున్నాయి. అయినా గానీ ఆ లారీలను ఏ అధికారీ కూడా అడ్డుకోవడం లేదు. రెవెన్యూ, మైనింగ్ శాఖాధికారులకు ఫిర్యాదులు చేసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ.భోనంగి, దేశపాత్రునిపాలెం ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై స్పందించే మైనింగ్ అధికారులు కూడా పెదముషిడివాడ గ్రావెల్ తవ్వకాలపై స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కల్పించవలసిన సంబంధిత శాఖల అధికారులు గ్రావెల్ మాఫియాతో కుమ్మక్కయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరి వలన ప్రభుత్వాదాయానికి భారీగానే గండిపడుతోంది. ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ, మైనింగ్, విజిలెన్స్ శాఖాధికారులు స్పందించి గ్రావెల్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదాలకు నిలయంగా వావిలపాడు రోడ్డు

– అదుపుతప్పి పొలాల్లో బోల్తాపడ్డ క్వారీ లారీ– తప్పిన పెను ప్రమాదం

– ఊపిరి పీల్చుకున్న వావిలపాడు గ్రామస్తులు

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని వావిలపాడు నుండి కే.డి రోడ్డుకు ప్రయాణించే రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది.ఈ రోడ్డు వెడల్పు చాలా తక్కువగా ఉండటంతో క్వారీల నుండి మెటీరియల్ పట్టుకెళ్లే భారీ వాహనాలు ఏదేచ్ఛగా అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి.ఈ రహదారిలో క్వారీ లారీలు వెళ్లేటప్పుడు ద్విచక్ర వాహనదారులు,ఆటో,కార్ల వంటి వాహనాలపై ప్రయాణం చేసే వాహనదారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు.ఇప్పటికే పలు పత్రికల్లో పలు వార్తలు ప్రచురితమైప్పటికీ సంబంధిత అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.వివరాల్లోకి వెళితే మండలంలోని వావిలపాడు క్వారీ నుండి కేడి రోడ్డు వైపు ప్రయాణిస్తున్న టిప్పర్ లారీ రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడంతో అదుపుతప్పి పొలంలో బోల్తా పడింది.వెంటనే సంఘటన స్థలంలో ఉన్న కొందరు వ్యక్తులు 108 వాహనానికి ఫోన్ చేయగా,108 వాహనం అక్కడికి చేరుకునే లోపే తమ సొంత వాహనంలో లారీ డ్రైవర్,క్లీనర్లను ఆసుపత్రికి తరలించారు.ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్,క్లీనర్ చిన్నచిన్న గాయాలతో బయట పడటంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ఈ రోడ్డు వెడల్పు పెంచి ప్రమాదాలను నివారణ చేయాలని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే భారీ వాహనాల్లో పరిమితికి మించి లోడ్లను వేసుకొని ప్రయాణం చేయడం వల్ల లారీలో తీసుకువెళ్లే 20,40, మెటీరియల్ పిక్క రోడ్డుపై పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.ఈ విషయంపై సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుపోవడం వలన క్వారీ యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

ఇది ప్రభుత్వ భూమి - ఆక్రమిస్తే శిక్షార్హులే...

–సర్వేలో నిగ్గు తేల్చిన రెవెన్యూ అధికారులు –హెచ్చరిక బోర్డు ఏర్పాటు

– హర్షం వ్యక్తం చేసిన నల్లబిల్లి గ్రామస్తులు

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసుకున్న రెవెన్యూ అధికారులు దృశ్యం.

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని నల్లబిల్లి రెవెన్యూ పరిధిలోని కే.డి రోడ్డులో వావిలపాడు జంక్షన్ ను ఆనుకొని ఉన్న 16సెంట్ల విస్తీర్ణంలో గల రస్తా పోరంబోకు భూమి ప్రభుత్వ భూమేనని రెవెన్యూ అధికారులు ధృవీకరించారు. నల్లబిల్లి గ్రామానికీ చెందిన ఒక వ్యక్తి ఆ భూమిని ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేపడుతుండడంతో గ్రామస్తులు చేసిన ఫిర్యాదుపై రెవెన్యూ అధికారులు స్పందించారు. మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామలక్ష్మి,మండల సర్వేయర్ అప్పల నాయుడు,విలేజ్ రెవెన్యూ అధికారులు తాతారావు,శ్రీను,సన్యాసి నాయుడు, అప్పలరాము,డెక్క ప్రసాద్, ఈశ్వరరావు,పలు గ్రామాల విలేజ్ సర్వేయర్లు ఆక్రమణ స్థలం వద్దకు చేరుకొని నిజనిర్ధారణ కోసం సర్వే చేపట్టారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నెంబర్ 49/1 లో 16సెంట్ల భూమి రస్తా పోరంబోకుగా నమోదై ఉన్నందున ఈ భూమిని ఎవరైనా ఆక్రమించినా అక్రమ కట్టడాలు జరిపినా చట్టపరంగా శిక్షకు అర్హులని పేర్కొంటూ ఆ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.ఈ సర్వేలో గ్రామ,వీఆర్యేలు అశోక్,గురువులు తదితరులు పాల్గొన్నారు.

స్థలాన్ని సర్వే చేస్తున్న రెవిన్యూ అధికారులు దృశ్యం.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: రోటరీ క్లబ్ అనకాపల్లి వారి అభయ్ ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగు తుందని, పరీక్షలతోపాటు అవసరమైన వారందరికీ ఉచితంగా మందులు కూడా అందజేయడం జరుగుతుందని రోటరీ క్లబ్ అధ్యక్షులు పీజే నాయుడు, రోటరీ గవర్నర్ బుద్ధ రమణాజీ అన్నారు. ఈ మేరకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత మెడికల్ క్యాంపును పట్టణంలో న్యూకాలనీలోగల రోటరీ కళ్యాణమండపంలో ఆదివారం ప్రారంభించారు. ఇక నుంచి ప్రతీ ఆదివారం ఇక్కడ హెరీమియో వైద్యులు డాక్టర్ విల్లూరి జోగినాయుడు, డాక్టర్ కృష్ణమూర్తి, డెంటల్ వైద్యులు డాక్టర్ సంజన ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ ఆడారి రామకృష్ణ, ట్రెజరర్ రాపేటి నారాయణరావు, సానా త్రినాథ్. క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

తాడిని తరలించాకే పనులు చేపట్టండి

రాంకీ పైప్ లైన్ నిర్మాణంపై గ్రామస్తుల ఆందోళన

ఆందోళన చేస్తున్న తాడి గ్రామస్తులు

విశాలాంధ్ర-పరవాడ : తాడి గ్రామాన్ని తరలించాకే రాంకీ యాజమాన్యం పైప్ లైను నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామాన్ని ఆనుకుని గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో రాంకీ యాజమాన్యం చేపడుతున్న పైప్ లైన్ నిర్మాణంపై గ్రామస్తులు ఆదివారం ఆందోళనకు దిగారు. అక్రమంగా తలపెట్టిన పైప్ లైన్ పనులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రాంకీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్రామాన్ని తరలించే వరకూ ఎలాంటి పనులు చేపట్టొద్దన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాదంశెట్టి నీలబాబు, బొడ్డపల్లి అప్పారావు, గనిరెడ్డి కనకరాజు తదితరులు మాట్లాడారు. తాడి ప్రజల ప్రాణాలతో రాంకీ యాజమాన్యం చెలగాటం ఆడుతోందని మండి పడ్డారు. ఇప్పటికే కాలుష్యంతో అల్లాడుతున్న తాడి గ్రామాల ప్రజలను పొమ్మన కుండానే పోగ బెట్టి తరిమేసేలా ఉన్నారని వాపోయారు. వెంటనే రాంకీ పైప్ లైన్ పనులను నిలుపుదల చేసి తాడిని తరలించిన తర్వాతే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జుత్తుక మాదవరావు, కోమటి కులదీప్ రాజ్, మాదంశెట్టి సూరిబాబు, కోమటి అచ్చిబాబు, కోమటి సూరిబాబు, గొల్లవి లచ్చిబాబు, సాలాపు రాజు, కోమటి శివాజీ, కోరుకొండ పైడి రాజు, నల్ల పరంటయ్య, గొల్లవిల్లి సత్తిబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు నగదు పంపిణీ

విశాలాంధ్ర -మాకవరపాలెం: మండలం మాకవరపాలెం గ్రామంలో ప్రతి సంవత్సరం యువకుల ఉత్సాహం కొరకు క్రికెట్ పోటీలు నిర్వహించడం జరుగుతుంది అని శ్రీకాంత్ తెలిపారు.ఈ సంవత్సరం కూడా మాకవరపాలెం ప్రీమియర్ లీగ్ నిర్వ%ఎ%హించడం జరిగింది. ఈ లీగ్ కి స్పాన్సర్లుగా వడ్లమూడి బాలాజీ మరియు బయ్యవరం గ్రామం శ్రీను తామరం,హరిబాబు మాకవరపాలెం రుత్తల సత్యనారాయణ (జెడి) స్పాన్సర్ చేయడం జరిగింది గత 15 రోజులుగా జరుగుతున్న ఈ టోర్నమెంట్లో విజేతలు నిర్ణయించడం జరిగింది అని ఆయన అన్నారు.జడ్పీ టైగర్స్ రుత్తల శేష్ కుమార్ గారు టీమ్ రెండవ విజేతగా పాశపు సురేష్ గారి టీమ్స్ విజేతగా నిలిచారు. వీళ్ళకి ఈరోజు ట్రోఫీ ఇవ్వడం జరిగింది. టోర్నమెంట్ లో ప్రతిభ కనబరిచిన వాళ్లకి 5000 రూపాయల చెక్కు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమం నిర్వహించిన చింతకాయల శ్రీకాంత్ ఈ కార్యక్రమానికి సహకరించిన పెద్దలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బ్రాండిక్స్ ఉచిత కంటి వైద్యశిబిరం

విశాలంధ్ర -అచ్యుతాపురం: బ్రాండిక్స్ తన ముఖ్యమైన సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో బాగంగా ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి 300మంది హాజరు కాగా 275మందికి కంటిచూపు పరీక్షలు నిర్వహించారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో 155కి ఉచిత అద్దాలను , 83మందికి మందులు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 30మందికి కేటరాక్ట్ సర్జరీ చేయించు కోవాల్సిం దిగా వైద్యులు సూచించారు. ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొరస్వామి మాట్లాడుతూ బ్రాండిక్స్ ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా స్థానిక ప్రజల ఆరోగ్య సంరక్షణకు అండగా నిలవాలన్నదే ఈ కార్యక్రమం లక్ష్యం అన్నారు . ఈ కార్యక్రమంలో వచ్చినవారికి మజ్జిక , పలహారాలు అందించారు

బెల్ట్ షాపులపై పోలీసులు దాడులు

– 15మద్యం సీసాలు స్వాదీనం –కేసు నమోదు చేసిన ఎస్ ఐ దామోదర్

విశాలాంధ్ర-గరివిడి : మండలంలో వెదుళ్ల వలస గ్రామంలో శనివారం రాత్రి బెల్ట్ షాపులు పై స్థానిక ఎస్ఐ ఎల్. దామోదర్ రావు ఆధ్వర్యంలో పోలీసులు బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భాగంగా ఆ గ్రామానికి చెందిన విసినిగిరి రామారావు నుంచి 15 మద్యం బాటిల్ ను, ఒక మోటార్ వెహికల్ ను స్వాధీనం చేసుకున్నట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.